# వెన్నెలలో

తెల్లచీర కట్టుకొన్నది. తల దువ్వుకొని అర్ధచంద్రాకారంగా మల్లెపూలు పెట్టుకొని, వాటి మధ్య గులాబీలు అమర్చింది. పచ్చని మెడలో జెర్రిపోతులాగ బంగారపు గొలుసొకటి మెరుస్తూంది. పిల్లలను నిద్రపుచ్చి వచ్చింది నా దగ్గరకు. నేను పండు వెన్నెలలో మంచంమీద పరుపు వేసుకొని పైన తెల్ల దుప్పటి పర్చుకొని, తలవైపు దీపం పెట్టుకొని, పడుకొని చదువుకొంటున్నాను. వచ్చీ,

"ఏమిటండి చదువుతున్నారూ" అన్నది మందహాసం చేస్తూ. మాట్లాడలేదు.

"మాట్లాడరా, మీలో మీరే నవ్వుకోవాలేం? చెప్పండి అదేమిటో" అన్నది దీపం తగ్గిస్తూ.

"చెప్పమంటావా?"

"మరేమిటి నేననటమూ?"

"పద్మములతో సమానమైన ముఖము గల సుందరీ–" అంటూంటే మా ఆవిడ మాటకు అడ్డం వచ్చి,

"అదేమిటి ఆ వికారం మళ్ళీనూ" అన్నది.

ఇది వరలో ఇల్లాంటి వికారాలు నాకు తరచూ రావటం మా ఆవిడ చికిత్స చేయటం చాలాసార్లు జరిగినాయి. అందుకని అలాగ అన్నది. "ఏమి వికారం కనపడ్డది అప్పుడే నీకు" అన్నాను నేను.

"ఆ మాట లేమిటి? పద్మములతో సమానమైన ముఖము గలదానా అని అనటం ఎందుకూ" నన్ను వచ్చీ రావటంతోనే–– ఇవీ ఆవిడ మాటలు.

"నిన్నెవరన్నారూ?" ఇవి నా మాటలు.

"మరి ఎవరి నన్నారేమిటి? నేను ఇంకా నన్నే అన్నారనుకొంటున్నా, ఇంకా ఎవరినైనా కూడా - ఇలాంటి మాటలు అంటూ వున్నారా ఏమిటి!! లేకపోతే కలవరిస్తున్నారా?" అన్నది మా కాంతం నా ప్రక్కనే నన్ను ఆనుకుని కూర్చుని.

దానికేదన్నా జవాబు చెప్పాలెగదా నేను. చెప్పలేదు. నవ్వనైనానవ్వలేదు. ఊరికే అల్లాగ ఉండిపోయినాను. పుస్తకంలాగ పడుకొని ఊరుకొన్నాను. పలకలేదు; ఉలకలేదు.

నే నంటే బుద్ధి చెప్పుకొని ఊరుకున్నానుగాని ఆ నోరులేని చేతులకు ఏం తెలుసు పాపం తలక్రిందనున్న ఎడమచేయి పడగవిప్పిన పాములాగ లేచి ఆమె కటి స్థానాన్ని చుట్టివేసింది. ఇక అంతపని జరిగిన తరువాత ఊరుకోవటం ఎందుకని నేనూ, ఒక వేలును నాభిస్థానానికి తాకించి చక్కిలిగింత పెట్టాను.

"నిన్ను అనటం కాదూ .... ఇంకొకరిని అనటమూ కాదు. పుస్తకాల్లో మాటలు చదువుతున్నాను" అని అప్పటికి తెముల్చుకొని జవాబు చెప్పగలిగినాను. "అల్లాగా! ఏమిటి చదవండి. చదవండి. ఎవరూ అంటూ ఉన్నారూ, ఏమిటి సందర్భం? చెప్పండి కథ ఏమిటో – వింటానూ." అన్నది మా ఆవిడ వంగి, నా ముఖంమీద ముఖంపెట్టి చెదరిన నా క్రాపును సవరిస్తూ.

"చెప్పటానికి పెద్ద కథ ఏమిలేదు ఇందులో. ఇదొక వైద్య గ్రంథమూ, ఇందులో...'

"వైద్యగ్రంథమూ అంటే మందూ మాకూ"

"ఆఁ అదే అదే. రోగాలూ, రోగ లక్షణాలూ వాటిని చికిత్స చేయాల్సిన విధం అదంతా ఈ పుస్తకంలో వ్రాశాడు గ్రంథకర్త" అన్నాను.

ఈ మాటలు అంటూనే వున్నానూ, నా కుడిచెయ్యి పుస్తకాన్ని వదిలేసి, అమాంతంగా దానంతట అదే వెళ్ళి పోయి ఆమె చెక్కిళ్ళమీద పడిపోయింది, అందులో నా ప్రయత్నం ఏమీలేదు.

ఆవిడ నా చెయ్యి మెల్లగా, బహు జాగ్రత్తగా తీసింది. అదేదో నలిగిపోగల మెత్తని పువ్వులాగ తీసి, తన రొమ్ముపై నానించుకొని నా వేళ్ళ సందుల్లోకి తన వేళ్ళు పోనిచ్చి, విలాసంగా నొక్కుతూ మళ్ళీ అన్నది, "అయితే చూడండి. రోగాల సంగతి చదువుతుంటే నవ్వు ఎందుకు వచ్చిందండీ?" అని.

"దానికి ఒకటీ .... రెండూ .... చూశావా రెండు కారణాలున్నాయి" అన్నాను. చెయ్యి చిలిపి చేష్టలు చేస్తూ వుండగానే.

"ఆ రెండు కారణాలూ ఎల్లాంటివో నొక్కి వక్కాణించండి" అన్నది మా ఆవిడ నవ్వుతూ, నా చెక్కిళ్ళు కూడా నొక్కింది.

"అట్లాగే .... అంతకంటే సంతోష విషయమేముందీ? మొదటి విషయం, ఈ వైద్య గ్రంథకర్త లోలంబరాజు, వైద్య గ్రంథాన్ని అంతా తన ప్రియురాలుకు చెప్పినట్టుగా వర్ణించాడు."

"అయితే మీకు నవ్వు ఎందుకూ?"

"నేను నా కథలన్నీ నా పేరనే వ్రాసినట్టుగా వుందని నవ్వు వచ్చింది."

"అల్లాగ కాదు. మీరు వ్రాసిన పుస్తకాలన్నీ కూడా నాకు చెప్పినట్లుగా వ్రాయిండి. "ఓ కాంతం! అక్బరు చక్రవర్తి మహమ్మదీయుడు అయి–హిందువుల యెడ మిక్కిలి దయతో ప్రవర్తించడంచాలా గొప్ప విషయం సుమా!" అని ఈ ధోరణిలో వ్రాయండి."

"సరేలే. అది అట్లాగుంచు. ఇక్కడ వ్రాస్తాడూ, ఓ రత్నకలా, కటకరోహిణి కషాయము నోటి అసహ్యమును పోగొట్టుటయున్నూ తామర మొగ్గవంటి కుచములు గల స్త్రీని ఆలింగనము చేసుకొనుట వలన స్త్రీకి సంతోషము కలుగుటయున్నూ, అను నీ రెండున్నూ నాకు ఆశ్చర్యముగా వున్నవీ అని."

"ఇక ఈ విషయం ఈ పాటున కట్టిపెట్టి మీరు నవ్వటానికి ఆ రెండోకారణం ఏదో అది కొంచెం నొక్కకుండా వక్కాణించండి."

"రెండోది ఏముందిలే – అది సామాన్య విషయమే. ఆ పుస్తకంలో రోగాలను గురించి చదువుతూ ఉంటే ఆ రోగ లక్షణాలన్నీ నాకు వున్నట్లు తోస్తున్నది. సన్నిపాత లక్షణాలను గురించి చెపుతూ – శరీరమంతయు నొచ్చుట మొదటి విషయమూ అన్నాడు. ఇప్పుడు నాకు శరీరమంతా నొప్పులుగా ఉంది." ఉరిమి చూచుట అన్నాడు తరువాత.

"అది మీకు అలవాటే ఆయెను. చీటికి మాటికి ఉరిమి చూస్తుంటారు. ఈ

లక్షణం మటుకు మీకు తీవ్రంగా వున్నట్లు నేనే ఒప్పుకుంటాను" అన్నది.

సరే నీవే ఒప్పుకొన్నావా! ఇక మూడో లక్షణం కనుబొమ్మలు ముడిపడుట అని వుంది.

"సరిసరి. ఇక చెప్పనక్కర్లేదు. ఉరిమిచూట్టం, కనుబొమ్మలు ముడిపడటం మనకు సహా లక్షణాలేనాయె. తరువాత?"

"తరువాత ఆడటం - పాడటం" అన్నాడు.

"అవి ఇంకా పుట్టలేదనుకొంటా" అన్నది లేచి ఆడి పాడుదామా అనిపిస్తున్నది."

"కాబట్టి ఏమంటారు ఇంతకూ?"

"ఏమనేది ఏమున్నదీ - చిత్తవిభ్రమ సన్నిపాతం నాకు పూర్తిగా కలిగింది."

"ఎబ్బే? ఏ మాటలివీ- "

"ఉన్నమాట అంటే నీకు అంత కష్టం ఎందుకూ? కలిగిన మాట నిజము - చిత్త .... విభ్రమ ..... సన్నిపాతం - తెలిసిందా?" అని మాట విడదీసి ఉచ్చరించాను.

"మీకా, చిత్త-విభ్రమ-సన్నిపాతమా?" అని పకపకా నవ్వుతూ, తన రెండు చేతులతో నా తలను తన మెత్తని ముఖానికి అద్దుకొంది.

పేరంటానికి వెళ్ళివచ్చింది కాబోలు ఆరోజు. మెడకు మంచి పరిమళము గల గంధం పూశారు. ఆ సువాసన, ఆ తల నూనెకు సంబంధించిన పరిమళం నాకు మత్తెక్కించినాయి. నాకు కళ్ళు మూతలు పడ్డాయి.

ఆమె పెదవులు నా బుగ్గలను వెచ్చగా తాకేటంత వరకు నాకు ఈ లోకమే తెలియదు.

నిజంగా నేను ఆ రోజున ఏదో స్వర్గసౌఖ్యాన్ని అనుభవించాను. నేను కవినిగాదు, భాషరాదు. ఆ సౌఖ్యాన్ని వర్ణించలేను. కాని అనుభవించాను. ఆ జన్మకు ఆఖరుసారి అనుభవించాను. ఆ సౌఖ్యము యొక్క లోతూ రంగూ, ఆనందమూ అనుభవించిన వాళ్ళకే తెలియాలె.

కాని ఆ ఆనందం ఇలాంటిదీ అని చెప్పడానికి నోరు లేదే అని ఏడుపొస్తున్నది.

చెప్పలేక పోనీండి. కాని నేను ఆనందాన్ని పొందినమాట నిజమేగా!! అనుభవించాను. అనుభవించాను. అనుభవించాను. జన్మలో ఇక అనుభవించను, ఆ రోజున నిజంగా చిత్తవిభ్రమ సన్నిపాతం కలిగింది. అందుకని అన్నానూ, ఆవిడతో అప్పుడూ, "నిజంగా కాంతం ! నాకు ఆ జబ్బు ఏర్పడ్డదీ" అన్నాను.

"చాల్లే – ఊరుకోండీ – పోనీ అయినా ఆ జబ్బుకు చికిత్స ఏమిటో చదవండీ చుద్దామూ" అన్నది.

"ఈ రోగాలకూ – కషాయాలు పనికిరావట!"

'ఊ"

"లేహ్యాలు అసలే పనికిరావట!"

"మరి ఏమన్నాడండీ – " అన్నది తన చేతితో నా చేతిని నొక్కుతూ.

"శ్లోకం విను."

"అర్థం చెప్పుదురూ. ఇప్పుడు శ్లోకాలు వినటానికి ఓపికెక్కడ వుందీ! నిద్ర వ స్తున్నది" అని పక్కనైన వొరిగి పండుకొని ఆవలించి రెండు చిటికలు వేసింది. మెళ్ళో గొలుసు పక్కకు జారి తళుక్కుమన్నది వెన్నెల్లో. ఆ తెల్లని వెన్నెల్లో ఆమె బుగ్గలు నీటి బుడగలలాగ మెరసినవి. ఆ ముఖం చంద్రుడి దగ్గర ఆర్ద్ర నక్షత్రంలాగ ఆ క్రింది పెదవి ఎర్రగా వుంది. మల్లెపూలు జారి కొన్ని పక్కమీద పడ్డాయి.

దృఢమాలింగనం పథ్యం

క్వాథశ్చాధరచుంబన్ –

"వింటున్నావా – ప్రియురాలియొక్క అధర చుంబనమే కషాయమట – ... ఆమె గాఢాలింగనమే పథ్యమట, ఆఁ విన్నావా? కాబట్టి ..."

"ఊఁ కాబట్టి – ఆఁ కాబట్టి – చెప్పండి ఏమిటో"

"కాబట్టి ఇప్పుడేం చేయాలో తెలుసునా, నా ఈ రోగం నయం కావాలంటే!"

"ఊఁ ఏం చెయ్యాలా? .... ఆ ....'

"అబ్బా ! ఊరుకోండి"

పుస్తకం, ఇక మా ప్రక్కన వుండటానికి ఇష్టంలేక థపీమని కిందపడిపోయింది.

(1962)